




TGTEL/25/A3149

# ఈకాలం

వార్త తెలుగు దిన పత్రిక TELUGU DAILY



**రిపోర్టర్లు కావలెను**

'ఈకాలం వార్త' తెలుగు దిన పత్రికలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో పని చేయుటకు రిపోర్టర్లు కావలెను.

**అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం**

ఆసక్తి గల వారు ఈ కింది నెంబర్లను సంప్రదించండి

8688339954

7013439800



ఆదివారం 18-01-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :79 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : దేవేందర్ నూకల


# పట్టాలెక్కిన తొలి వందేభారత్ స్లీపర్ రైలు..

## జెండా ఊపిన ప్రధాని మోదీ



- ప్రారంభం: పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ అధునాతన రైలును జెండా ఊపి ప్రారంభించారు.
- మార్గం: ఈ రైలు హౌవ్‌డా (పశ్చిమ బెంగాల్) - గువాహటి/కామాఖ్య (అస్సాం) మధ్య నడవనుంది.
- గరిష్ఠ వేగం: ఇది గంటకు 180 కి.మీ. వేగంతో ప్రయాణించగలదు.
- స్థిరత్వం: రైలు గరిష్ఠ వేగంతో వెళ్తున్నప్పుడు కూడా లోపల ఉంచిన గ్లాసులోని నీళ్లు ఏమాత్రం తొణకవు.

కోచ్‌లు: ఈ రైలులో మొత్తం 16 కోచ్‌లు ఉన్నాయి.

భారత్‌లో తొలి వందేభారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కింది. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో జరిగిన కార్యక్రమంలో ఈ అధునాతన రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు స్లీపర్ రైల్లో ప్రయాణించే విద్యార్థులతో మోదీ ముచ్చటించారు. రైలు లోపలికి వెళ్లి అందులోని సౌకర్యాలను ప్రధాని పరిశీలించారు. పశ్చిమ బెంగాల్‌లోని హౌవ్‌డా- అస్సాంలోని గువాహటి (కామాఖ్య) మధ్య ఈ రైలు రాకపోకలు సాగించనుంది.వందేభారత్ స్లీపర్ రైలు గంటకు 180 కి.మీ. గరిష్ఠ వేగాన్ని సాధించగలిగింది. రైల్వే భద్రత కమిషనర్ (సీఆర్ఎస్) సమక్షంలో కోటా (రాజస్థాన్) నుంచి నాగ్దా (మధ్యప్రదేశ్) మధ్య తుది పరీక్షలు నిర్వహించగా రైలు ఈ వేగాన్ని చేరుకుంది. గాజు గ్లాసుల్లో నీళ్లు నింపి ఒకదానిపై ఒకటిగా ఈ రైలింజిన్‌లో ఉంచినా.. రైలు గరిష్ఠ వేగాన్ని చేరుకున్నప్పుడు కూడా ఏమాత్రం నీళ్లు తొణకకపోవడాన్ని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గతంలో సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. వందే భారత్ స్లీపర్ రైలు.. ఈ ఫీచర్లు తెలుసా? ఈ రైల్లో 16 కోచ్‌లు ఉన్నాయి. వీటిలో ఆకర్షణీయమైన (ఏసీ) స్లీపర్ బెర్తులు, అధునాతన సస్పెన్షన్ వ్యవస్థ, నిప్పును గుర్తించే వ్యవస్థలు, సీసీటీవీ నిఘా వంటివి ఉంటాయి. విమానంలో ప్రయాణించిన అనుభూతిని కలిగించేలా ఇందులో సౌకర్యాలను ఏర్పాటుచేశారు. ఇందులో కనీస ఛార్జి రూ.960 నుంచి ప్రారంభమవుతుంది. ఆర్ఏసీ, వెయిటింగ్ లిస్ట్ వంటి వాటిని ఇందులో అనుమతించరు.

# రిపబ్లిక్ డే అలర్ట్..

## ఉగ్ర ముప్పుపై నిఘా వర్గాల హెచ్చరికలు



దిల్లీ: ఈ ఏడాది గణతంత్ర వేడుకలను లక్ష్యంగా చేసుకొని దిల్లీలో దాడులకు ఉగ్ర సంస్థలు ప్రణాళికలు రచిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఖలిస్థానీ, బంగ్లాదేశ్ కేంద్రంగా ఉన్న ఉగ్ర సంస్థలు రిపబ్లిక్ డే రోజున దిల్లీ సహా దేశంలోని ప్రముఖ నగరాల్లో దాడులకు ప్రయత్నించవచ్చని తెలిపాయి . పేజి 2లో

### బెంగాల్‌కు చొరబాట్లే

## అసలు సవాల్




ప్రజల ఆకాంక్షలను తీర్చడంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం విఫలమైందని, బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ప్రధాని మోదీ అన్నారు. పశ్చిమబెంగాల్ పర్యటనలో భాగంగా ప్రధాని మాట్లాడుతూ.. పేజి 2లో

## 'లక్కీడ్రా'

### పేరుతో మోసాలు..

**ఇన్‌ఫ్లూయెన్సర్లకు సజ్జనార్ వార్నింగ్**



### కర్నాటక మాజీమంత్రి ఖండ్రే మృతి

**సంతాపం తెలియ చేసిన డిప్యూటీ సిఎం పవన్**



కర్ణాటక మాజీ మంత్రి, ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధులు డాక్టర్ భీమన్న ఖండ్రే మృతి పట్ల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంతాపం తెలిపారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. పేజి 2లో

### బీఆర్ఎస్ ర్యాలీ.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద ఉద్రిక్తత



2లో

హైదరాబాద్: సికింద్రాబాద్ కార్పొరేషన్ కోసం బీఆర్ఎస్ పోరు బాట పట్టింది. సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ..

# మారీచ, సుబాహులు ఏ రూపంలో వచ్చినా..

# ప్రజలు తరిమి కొడతారు: రేవంత్‌రెడ్డి



మహబూబ్‌నగర్: దేశంలో ఏ ప్రాజెక్టు కట్టినా.. వాటిలో పాలమూరు బిడ్డల శ్రమ ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.1,284 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు."దేశంలోనే అత్యంత వెనుకబడిన మండలం ఈ జిల్లాలోని గట్టు మండలం. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం పదేళ్లపాటు పాలమూరు జిల్లా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది. కేసీఆర్ పదేళ్లపాటు పాలమూరు జిల్లాకు ఒక్క ప్రాజెక్ట కూడా తీసుకురాలేదు. పాలమరు-రంగారెడ్డి ప్రాజెక్టును 2013లో అప్పటి కాంగ్రెస్ నేతలు సాధించారు. ప్రాజెక్టు పేరు మీద రూ.23 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించారు కానీ, ప్రాజెక్టు పూర్తి చేయలేదు. ఉద్దండాపూర్ జలాశయం భూ నిర్వాసితులకు నిధులు చెల్లించలేదు. పేజి 2లో

### జీవితంలో సంగారెడ్డిలో పోటీ చేయను..

## ఇదే నా శపథం: జగ్గారెడ్డి

- పోటీ చేయను: తన జీవితంలో ఇకపై ఎన్నడూ సంగారెడ్డి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయనని జగ్గారెడ్డి శపథం చేశారు.
- రాహుల్ గాంధీ పట్ల ఆవేదన: రాహుల్ గాంధీ స్వయంగా వచ్చి తనను గెలిపించాలని కోరినా, ఇక్కడి ప్రజలు తనను ఓడించడం వల్ల రాహుల్‌ను ఇన్సల్ట్ చేసినట్లు భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.
- ఓటమికి కారణం: తన ఓటమికి పేద ప్రజలు కారణం కాదని.. ఇక్కడి మేధావులు, పెద్దలే తనను ఓడించారని ఆయన వ్యాఖ్యానించారు.



సంగారెడ్డి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని సంగారెడ్డికి పిలిచి ఇన్సల్ట్ చేశానేమోనని తాను ఫీల్ అయ్యానని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. తన కోసం రాహుల్ గాంధీ సంగారెడ్డికి వచ్చి.. తనను గెలిపించాలని ప్రచారం చేస్తే ఇక్కడి ప్రజలు ఓడించారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే సంగారెడ్డిలో తాను ఎమ్మెల్యేగా జీవితంలో పోటీ చేయనని శపథం చేశారు. ఇళ్ల జాగా లేని పేదలతో సంగారెడ్డిలోని గంజి మైదానంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ తన భుజంపై చేయి వేసి జగ్గారెడ్డిని గెలిపించాలని అడిగితే.. ఇక్కడి ప్రజలు ఓడించారని ఆవేదన వ్యక్తం చేశారు.

## అమరావతిలో పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహం: డూండి రాకేష్

- భారీ విగ్రహం: అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు.
- ప్రతీక: ఆయన ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం చేసిన 58 రోజుల నిరాహార దీక్షకు గుర్తుగా విగ్రహం ఎత్తును 58 అడుగులుగా నిర్ణయించారు.
- ముహూర్తం: ఈ విగ్రహాన్ని మార్చి 16న ఆవిష్కరించనున్నట్లు డూండి రాకేష్ తెలిపారు.



2లో

## జంట నగరాల అస్తిత్వం దెబ్బతీస్తే ఉపేక్షించం: కేటీఆర్



హైదరాబాద్: సికింద్రాబాద్ కార్పొరేషన్ కోసం బీఆర్ఎస్ ర్యాలీకి సిద్ధమైంది. సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ.. మాజీ మంత్రి తలసాని ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఎంజీ రోడ్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు భారీ శాంతి ర్యాలీకి నేతలు బయలుదేరారు. అయితే.. తమను పోలీసులు అడ్డుకున్నారని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు."జంట నగరాల అస్తిత్వం దెబ్బతీస్తే ఉపేక్షించం. ప్రజలకు నిరసన హక్కు లేకుండా చేశారు. ప్రజల దీవెనలతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. తుగ్లక్ పనులు చేస్తోంది" అని కేటీఆర్ అన్నారు.కోర్టు నుంచి అనుమతి తీసుకుని మళ్లీ ర్యాలీ నిర్వహిస్తామని ఆ పార్టీ నేత తలసాని అన్నారు. తాము నిర్వహిస్తున్నది శాంతియుతమైన ర్యాలీ అని.. అందరినీ ఆహ్వానించినట్లు తెలిపారు. ర్యాలీని అడ్డుకోవడం ప్రభుత్వానికి మంచిది కాదని మండిపడ్డారు.

# సంపాదకీయం

## మోదీ భారత్‌లో కొత్త మిథ్యవాదం

సంక్రాంతి పండుగ జరుపుకున్న ఆనందోత్సాహాలలో ఉండివుంటారు కదూ, శుభవార్తలే నివేదిస్తాను. ఎందుకంటే అవే వెల్లువెత్తుతున్నాయి మరి. రిటైల్ ద్రవ్యోల్బణం (వినియోగ వస్తువుల ధరల సూచీ ద్రవ్యోల్బణం అని కూడా అంటారు) 1.33 శాతం; 2025--26 ఆర్థిక సంవత్సరానికి స్థూల దేశీయోత్పత్తి పెరుగుదల రేటు 7.4 శాతంగా అంచనా వేశారు. భేష్. మరొక భేష్‌ను కూడా మనం జోడించి తీరాలని నేను భావిస్తున్నాను. ఎందుకు? మన సువిశాల భారతదేశంలో ఎక్కడా నిరుద్యోగమనేది లేదు. కనీసం మనకు కలవరపాటు కలిగించే లేదా కలవరం చెంది తీరాల్సిన తరహా నిరుద్యోగం లేనేలేదు!

ఉద్యోగాలు కోరుకునేవారే లేరు! సహేతుకమైన కారణాలతోనే నేను ఈ మాట అంటున్నాను. ప్రభుత్వంలోను, ప్రభుత్వ అనుబంధ సంస్థలలోను వేలాది ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. అయినా వాటిని కోరుకునేవారు లేరు. అవి ఎంతకూ భర్తీ కావడం లేదు. మంచి వేతనం (8వ వేతన సంఘం ఇంకా పెంచుతుంది), కరువు భత్యం, వార్షిక వేతన పెంపుదలలు, ప్రమోషన్లు, ఉద్యోగ భద్రత, వైద్య సదుపాయాలు, హెచ్‌ఆర్‌ఏ, ప్రయాణ రాయితీలు, వేతన లబ్ధితో సెలవులు, అడ్వాన్స్‌లు, రుణ సదుపాయాలు, యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ -- సుఖవంతమైన జీవితానికి ఇంతకు మించిన భరోసా ఏముంటుంది? అయినా యువతీయువకులు ఈ ఉద్యోగాలను తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. ఉద్యోగ ఆరాటం లేని తరం కాబోలు ఇది. ప్రభుత్వం వేలాది ఉద్యోగాలను మంజూరు చేసింది. అయినా అవి ఖాళీగానే ఉంటున్నాయి. ఈ అసాధారణ పరిస్థితిని చూస్తుంటే మీకేమనిపిస్తుంది? నిరుద్యోగం లేదని, ఉద్యోగాలకు అరాటడుతున్నవారు లేరనే కాదూ?విద్యా మంత్రిత్వశాఖ సమాచారం ప్రకారం ఏప్రిల్ 1, 2024 నాటికి కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో మంజూరు అయిన, ఖాళీగా ఉన్న ఉద్యోగాల లెక్కలు ఇలా ఉన్నాయి: బోధనా సిబ్బంది-- మంజూరు అయినవి 18,940 కాగా ఖాళీగా ఉన్నవి/ భర్తీ కానివి 5,060; బోధనేతర సిబ్బంది ఉద్యోగాలు: మంజూరు అయినవి 35,640 కాగా ఖాళీగా ఉన్నవి, భర్తీ కానివి 16,719. మరింత స్పష్టంగా చెప్పాలంటే కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో 27శాతం అధ్యాపక ఉద్యోగాలు, 47శాతం బోధనేతర సిబ్బంది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. జూన్ 2025 నాటికి కేవీఎస్ (కేంద్రీయ విద్యా సంగథన్)లో 7,765 బోధనా సిబ్బంది పోస్టులు, ఎన్‌వీఎస్ (నవోదయ విద్యాసమితి)లో 4,323 ఉపాధ్యాయ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. అయినప్పటికీ విద్యారంగం ప్రవర్ధమానమవుతోందని ప్రభుత్వం నిశ్చిత స్వరంతో చెప్పుతోంది.

విద్యారంగంలోనే కాదు, ఇతర రంగాలలోనూ ఉద్యోగ ఖాళీలు పుష్కలంగా ఉన్నాయి. కేంద్ర సాయుధ పోలీసు దళాలు (సీఏపీఎఫ్)లో 25,487 కానిస్టేబుల్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. రాజస్థాన్‌లో ఎల్‌డీసీ/క్లర్క్ కేడర్--2 లో 10,664 ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. బిహార్‌లో 12,199 ఖాళీలు ఉన్నాయి. యూపీలో 60,244 కానిస్టేబుల్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. తమిళనాడులో 2,255 స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నర్సింగ్ ఉద్యోగాలు ఆశించేవారు పాఠశాల విద్య పూర్తి చేసిన లేదా పట్టభద్రులు అయిన దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారయి ఉండడం కద్దు. దేశవ్యాప్తంగా 21 ఏఐఐఎమ్‌ఎస్ (ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో 3,485 మంది అధ్యాపక పోస్టులు ఉండగా 1,731 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒడిషాలోని కేంద్రపారా జిల్లాలో 1,087 డాక్టర్లు, పారా మెడిక్స్ ఉండగా 805 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మన సమాజంలో బ్యాంకు ఉద్యోగాలు ప్రతిష్ఠాత్మకమైనవిగా ఉన్నాయి. వాటి వేతనభత్యాలే అందుకొక కారణం. 12 ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఉద్యోగాల పరిస్థితి ఇలా ఉంది: ఆఫీసర్లు 4,20,599; క్లర్కులు--2,43,817; సబ్ స్టాఫ్--84,092. ఉద్యోగ ఖాళీలు: ఆఫీసర్లు 17,500; క్లర్కులు 12,861; సబ్ స్టాఫ్ 2,206. కలత చెందవద్దు. ఆంతరంగిక భద్రత, ఆరోగ్య భద్రత, బ్యాంకింగ్ రంగాలలో అంతా సవ్యంగా ఉంది. నిర్దిష్ట విద్య, ఉద్యోగ నైపుణ్యాలు ఉన్న యువతను అగ్రశ్రేణి కంపెనీలతో అనుసంధానించేందుకు ప్రభుత్వ మద్దతు ఉన్న కార్యక్రమం ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ అక్టోబర్ 2024లో ప్రారంభించారు. కంపెనీలకు రెండు విడతలుగా చేసిన 1,65,000 ప్రతిపాదనలలో 20 శాతం మాత్రమే ఆమోదం పొందాయని డిసెంబర్ 2, 2025న ఒక జాతీయ దినపత్రిక వెల్లడించింది. వీరిలో ఐదోవంతు మంది ఇంటర్న్‌షిప్ పూర్తికాకముందే వెళ్లిపోయారని కూడా ఆ పత్రిక పేర్కొంది.

అభివృద్ధి చెందుతున్న భారత్‌లో నిరుద్యోగం ఒక సమస్య కాదని విశ్వసిస్తున్నవారు ఈ వ్యాసాన్ని ఇంతటితో చదవడం ఆపివేయవచ్చు. నిరుద్యోగం ఒక తీవ్ర సమస్యగా ఉందని భావిస్తున్నవారు వ్యాసాన్ని పూర్తిగా చదవండి. సత్యాన్ని ఒప్పుకోవాలి. ప్రభుత్వ వ్యవస్థల్లో ఉద్యోగ ఖాళీలు పెద్ద సంఖ్యలో ఉండడం, అవి భర్తీ కాకపోవడం అనేది భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ పాలన లోనే కాదు, అంతకు ముందు నుంచీ ఉన్నది. దశాబ్దాలుగా ఉన్నది అనేది ఒక చేదు సత్యం. అయితే బీజేపీ పాలనలో సంభవించిన రెండు సంఘటనలతో ఆ పరిస్థితి మరింతగా పెచ్చరిల్లింది.గతం పాపంలా వెంటాడుతోంది సుమా! ఆ రెండు సంఘటనల్లో మొదటిది నల్లధనంపై పోరాటం లేదా నోట్ల రద్దు (డీమానిటైజేషన్). ఇది మానవ తప్పిదమే. స్వయంగా చేసుకున్న తీవ్రగాయమిది. గతంలో నేను వ్యాఖ్యానించినట్టుగా ఈ నోట్ల రద్దు (డీమానిటైజేషన్) కచ్చితమైన అర్థంలో నోట్ల రద్దు కాదు. ఎందుకని? మోదీ సర్కార్ చేసిన నోట్ల రద్దులో ఏ కరెన్సీ నోట్లను చెల్లనివిగా చేయలేదు. అంటే రద్దు చేయలేదు. కరెన్సీ నోట్ల చెలామణి వ్యవస్థ నుంచి వాటిని తీసివేయనూ లేదు. 'పాతనోట్లను తీసుకుని కొత్త నోట్లు ఇచ్చేందుకు' ప్రతిపాదించిన పథకమది. చెలామణిలో ఉన్న కరెన్సీ మొత్తం విలువను పాత స్థాయికి పునరుద్ధరించిన పథకమది. నిజానికి పునరుద్ధరింపబడిన కరెన్సీ విలువ పాత స్థాయికి మించి ఉన్నది. నవంబర్ 4, 2016న చెలామణిలో ఉన్న కరెన్సీ మొత్తం విలువ రూ.17.97 లక్షల కోట్లు కాగా, డిసెంబర్ 2025 తుది రోజుల నాటికి చెలామణిలో ఉన్న కరెన్సీ మొత్తం విలువ రూ.39.24 లక్షల కోట్లు. అందుకు రెట్టింపు కంటే చాలా అధికంగా ఉన్నది. నోట్ల రద్దుతో వాటిల్లిన మహా దుష్ఫలితం వేలాది చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమల మూసివేత. లక్షలాది ఉద్యోగాలు ధ్వంసమయ్యాయి. ఈ వాస్తవాన్ని మోదీ ప్రభుత్వం ఈనాటికీ అంగీకరించడం లేదు అఖిల భారత వ్యాపార మండలి వెల్లడించిన వివరాల ప్రకారం 2016లో 6,25,00,000 చిన్న వ్యాపార సంస్థలు ఉండేవి. వాటిలో 48శాతం గత దశాబ్దంలో మూతపడ్డాయి.

### జీవితంలో సంగారెడ్డిలో పోటీ చేయను..
## ఇదే నా శపథం: జగ్గారెడ్డి

మొదటి పేజీ తరువాయి

తన జీవితంలో ఇది మరిచిపోలేనిదని అన్నారు. తన ఓటమికి కారణం పేద ప్రజలు కాదని.. ఇక్కడి మేధావులు.. పెద్దలు అని పేర్కొన్నారు. సంగారెడ్డిలో తన భార్య నిర్మల పోటీ చేసినా.. తాను ప్రచారానికి కూడా రానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లి ప్రచారం చేస్తా కానీ.. సంగారెడ్డిలో మాత్రం చేయనని తేల్చి చెప్పారు.

## అమరావతిలో పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహం: డూండి రాకేష్

మొదటి పేజీ తరువాయి

అమరావతి: ఈనెల 20న కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ కోరారు. జీవో నంబర్ 15తో అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమం ప్రభుత్వ అధికారిక కార్యక్రమమైందని తెలిపారు. వైకాపా హయాంలో దేవాదాయశాఖ మంత్రిగా పనిచేసిన వెల్లంపల్లి.. వైశ్యులకు, కన్యకాపరమేశ్వరి ఆలయాలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో 20న అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పొట్టిశ్రీరాములు 58 రోజుల దీక్షకు ప్రతీకగా మార్చి 16న అమరావతిలో 58 అడుగుల విగ్రహావిష్కరణ చేయనున్నట్లు డూండి రాకేష్ వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యులకు పెద్దపీట వేస్తోందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండను .. వాసవీ పెనుగొండగా పేరుమార్పు చేయడం ఆనందదాయకమన్నారు.

## బీఆర్‌ఎస్ ర్యాలీ.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద ఉద్రిక్తత

మొదటి పేజీ తరువాయి

మాజీ మంత్రి తలసాని ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఎంజీ రోడ్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు భారీ శాంతి ర్యాలీకి పిలుపునిచ్చారు. అయితే.. ఈ ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు తెలిపారు.


సికింద్రాబాద్ జిల్లా సాధన సమితి పేరుతో ర్యాలీకి అనుమతి అడిగారని.. అయితే నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ఈ కారణంతో ర్యాలీకి అనుమతి ఇవ్వలేదని చెప్పారు. ర్యాలీలో పాల్గొనేందుకు వస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. భారీ సంఖ్యలో పోలీసులు, ప్రత్యేక బృందాలను మోహరించారు.

### మారీచ, సుబాహులు ఏ రూపంలో వచ్చినా.. ప్రజలు తరిమి కొడతారు: రేవంత్‌రెడ్డి

సంగంబండ వద్ద బండ పగుల గొట్టేందుకు కేసీఆర్ పదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.

నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పదేళ్లపాటు నిర్లక్ష్యం చేశారు. గతంలో పాలమూరు జిల్లా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు.. జిల్లాలోని ప్రాజెక్టుల గురించి అడగలేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చ పెడితే సభకు రాకుండా పారిపోయారు. భాజపా ఎంపీలు రాష్ట్రానికి ఐఐఎం సాధిస్తే.. పాలమూరు జిల్లాలోనే భూమి ఇచ్చే బాధ్యత నాది. పాలమూరు జిల్లాను వెనకబడిన జిల్లాగా ఇంకా ఎన్నాళ్లు చూపించాలి? పదేళ్లలో రూ.1.80లక్షల కోట్లు ఖర్చు చేశారు కానీ.. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక్కటి పూర్తి చేశారు.. అది మూడేళ్లకే కుప్పకూలింది. పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేసే బాధ్యత నాది. ఇవాళ రాష్ట్రంలో 3.50 కోట్ల మంది పేదలకు రేషన్ కార్డులపై సన్న బియ్యం ఇస్తున్నాం. గతంలో పదేళ్ల పాటు పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. మారీచ, సుబాహులు ఏ రూపంలో వచ్చినా ఈ సారి ప్రజలు తరిమి కొడతారు" అని సీఎం అన్నారు.

## 19న ఏప్రిల్ నెల శ్రీవారి ఆర్జిత సేవల టికెట్ల విడుదల



తిరుమల: భక్తుల సౌకర్యార్థం 2026 ఏప్రిల్ నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవలు (సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) టికెట్లను ఈ నెల 19న ఉదయం 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఎలక్ట్రానిక్ లక్కీడిప్ రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 21న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.ఈ-టికెట్లు పొందిన వారు జనవరి 21 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే.. టికెట్లు మంజూరవుతాయి.22న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా, సాలకట్ల తెప్పోత్సవాలు, సాలకట్ల వసంతోత్సవాల టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షణ టోకెన్ల కోటాను విడుదల చేయనున్నారు. ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.24న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అదే రోజు.. మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటాను విడుదల చేస్తారు.మార్చి నెలకు సంబంధించిన శ్రీవారి సేవ, పరకామణి సేవ కోటాను ఈనెల 27న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని తితిదే అధికారులు సూచించారు.

## గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్

మొదటి పేజీ తరువాయి

కాలుష్యం వల్ల సముద్రంలోనూ పెను మార్పులు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు వెయ్యి కి.మీ సముద్ర తీరం ఉంది. 20 పోర్టులు ఏర్పాటు కానున్నాయి. ప్రపంచంలో ఎండ పుష్కలంగా ఉండేది మనదేశంలోనే. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ .. మన రాష్ట్రానికి వరం అని అన్నారు. మన సంస్కృతిని కాపాడుకుంటూనే టెక్నాలజీని వాడుకోవాలి. ఎంత ఎత్తుకు ఎదిగినా స్వగ్రామాన్ని మర్చిపోకూడదు. ఆలోచనలు ఆచరణలో పెట్టేవారు చాలా కొద్ది మందే ఉంటారు. వారిలో చలమలశెట్టి అనిల్ ఒకరు. చరిత్రను తిరగరాయడంలో తెలుగువాడు ముందున్నందుకు గర్వంగా ఉంది. ఆనాడు ఎన్టీఆర్ చొరవతో కాకినాడకు నాగార్జున ఫెర్టిలైజర్స్ కంపెనీ వచ్చింది. కాకినాడ గురించి భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా చర్చించుకుంటారు. ఇలాంటి పరిశ్రమలకు అనుకూలమైన పరిస్థితులన్నీ ఇక్కడ ఉన్నాయి. ప్రజలకు మేలు జరిగే ఆలోచనలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేస్తోంది. 2047 నాటికి మన రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తయారవుతుందని అన్నారు. గ్రీన్ అమ్మోనియా వల్ల వ్యవసాయ రంగానికి మేలు జరుగుతుందని అన్నారు. ప్రకృతి సేద్యం పెరగడమే అందరి ఆరోగ్యాలకు శ్రీరామ రక్ష. ఎరువులు, పురుగుమందుల వినియోగం బాగా తగ్గించాలి. గ్రీన్ అమ్మోనియాను ఏ దేశానికైనా ఎగుమతి చేసే అవకాశం ఉందని సీఎం అన్నారు. బలమైన సంకల్పం ఉంటేనే ఏదైనా సాధించగలమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. తాను పుట్టి పెరిగిన కాకినాడకి అనిల్ ఎంతో చేస్తున్నారని అభినందించారు. అనేక కష్టాలను తట్టుకుని ఏఎమ్ గ్రీన్ కంపెనీ పెట్టారు. పర్యావరణాన్ని పరిరక్షించు కుంటూ ముందుకెళ్తున్నాం. గ్రీన్ హైడ్రోజన్ దిశగా మనం వేసే అడుగులు చాలా కీలకం. క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం అన వివరించారు. కాలుష్య రహిత ఇంధన ప్రయాణంలో ఇదో మైలురాయి. రాష్ట్ర సుస్థిరాభివృద్ధిలో ఇది గేమ్ ఛేంజర్ కానుంది. ఈ ప్రాజెక్టు వల్ల వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతారని అన్నారు. గత ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తల ఇబ్బందులు తెలుసు. పార్టీలు మారవచ్చు.. కానీ, ప్రభుత్వ వ్యవస్థ శాశ్వతం అని పవన్ అన్నారు.

## కర్నాటక మాజీమంత్రి ఖండ్రే మృతి

మొదటి పేజీ తరువాయి

వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. 'కర్ణాటక రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి, మిత్రులు ఈశ్వర్ ఖండ్రే తండ్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు డా.భీమన్న ఖండ్రే మృతికి చింతిస్తున్నాను. వృద్ధాప్య సంబంధిత వ్యాధుల కారణంగా ఆయన తుదిశ్వాస విడిచారని తెలిసింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. స్వాతంత్ర్య సమరంలో, హైదరాబాద్ కర్ణాటక విముక్తి, కర్ణాటక సమైక్యత ఉద్యమాల్లో డా.భీమన్న ఖండ్రే కీలక పాత్ర పోషించారు. ఈశ్వర్ ఖండ్రేకు, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ ట్వీట్ చేశారు. కాగా.. కర్ణాటక మాజీ మంత్రి, ప్రముఖ స్వాతంత్య సమరయోధుడు భీమన్న ఖండ్రే(102) కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత వ్యాధుల కారణంగా గత అర్ధరాత్రి బీదర్ జిల్లా భాల్కి పట్టణంలోని తన నివాసంలో ఖండ్రే తుది శ్వాస విడిచారు. గత కొద్దిరోజులుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడటంతో పాటు రక్తపోటు సమస్యలతో ఆయన కొన్ని రోజులుగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా.. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రవాణా మంత్రిగా ఖండ్రే పనిచేశారు.

## రిపబ్లిక్ డే అలర్ట్..

మొదటి పేజీ తరువాయి

దేశ అంతర్గత భద్రతను దెబ్బతీసేందుకు ఖలిస్థానీ, ఇతర రాడికల్ హ్యాండ్లర్లు స్థానిక గ్యాంగ్‌స్టర్లను ఉపయోగించుకుంటున్నారని పేర్కొన్నాయి. హరియాణా, పంజాబ్, ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్‌లలో ఉగ్రనెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నట్లు సమాచారం అందినట్లు తెలిపాయి. గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు జరిగిన నేపథ్యంలో.. నిఘా వర్గాల హెచ్చరికలపై అధికారులు అప్రమత్తమయ్యారు. ఢిల్లీ సహా ఇతర ప్రముఖ నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేశారు.

## బెంగాల్‌కు చొరబాట్లే అసలు సవాల్

మొదటి పేజీ తరువాయి

అభివృద్ధి, సంక్షమానికి ప్రాధాన్యం ఇచ్చే భాజపా ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ప్రజలు ముఖ్యంగా జెన్-జీ కూడా భాజపా అభివృద్ధి నమూనాను విశ్వసిస్తున్నారని అన్నారు. మాల్దా సభలో ప్రసంగించిన ఆయన.. బిహార్‌లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక బెంగాల్‌కు సమయం ఆసన్నమైందన్నారు. ఈ సందర్భంగా బెంగాల్‌కు అసలైన సవాల్ చొరబాట్లేనని, వీటిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

చొరబాట్లే అసలైన సవాల్..

బెంగాల్‌కు అతిపెద్ద సవాల్ చొరబాట్లేనని.. వీటి కారణంగానే మాల్దా, ముర్షిదాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగుతున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. చొరబాట్ల ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల జనాభా వర్గీకరణలోనూ మార్పు వచ్చిందని, వీటిని అరికట్టడానికి తృణమూల్ కాంగ్రెస్ ఎటువంటి చర్యలు చేపట్టలేదని దుయ్యబట్టారు.

రాష్ట్రానికి వరద సహాయ నిధులను 40 సార్లు అందించామని, అయినా అవి అసలైన లబ్ధిదారులకు చేరలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కేంద్రం నిధులను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లగొడుతోందని.. ఆ పార్టీ అవినీతి, హింస, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడే పార్టీ అని అన్నారు. టీఎంసీ అధికారం కోల్పోయి.. భాజపా అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. తూర్పు భారత్ దశాబ్దాలుగా వెనకబడి ఉందన్నారు.

## 'లక్కీడ్రా' పేరుతో మోసాలు.. ఇన్‌ఫ్లూయెన్సర్లకు సజ్జనార్ వార్నింగ్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: బెట్టింగ్ యాప్‌ల మోసాలపై ఉక్కుపాదం మోపడంలో కీలకంగా వ్యవహరించిన హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్.. ఇప్పుడు లక్కీడ్రాలపై దృష్టి సారించారు. డ్రాల పేరుతో అమయాక ప్రజలను మోసం చేస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఇన్‌ఫ్లూయెన్సర్లను హెచ్చరించారు. ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ మేరకు ఎక్స్‌లో శనివారం పోస్ట్ పెట్టారు. కార్లు, బైకులు, డీజేలు ఇస్తామంటూ కొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు సామాజిక మాధ్యమాల్లో లక్కీడ్రా పేరుతో మోసాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సజ్జనార్ పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ల దందా బంద్ కావడంతో లక్కీ డ్రా అంటూ కొత్త వేషాలతో వీళ్లు దర్శనమిస్తున్నారని తెలిపారు. అమాయక ప్రజల ఆశను ఆసరాగా చేసుకుని మోసం చేసే ఇన్‌ఫ్లూయెన్సర్లను.. ది ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్

# పాలన, మీడియా పతనమైతే ప్రజాస్వామ్యమే ప్రమాదంలో డా. జితేందర్ రావు తనుగుల వ్యాఖ్య

ఈకాలం న్యూస్
హైదరాబాద్ :భారత ప్రజాస్వామ్యం ఈరోజు కీలక మలుపు వద్ద నిలబడి ఉందని, ప్రజల విశ్వాసమే ప్రజాస్వామ్యానికి అసలైన బలమని సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షులు డా. జితేందర్ రావు తనుగుల అన్నారు. ఆ విశ్వాసాన్ని నిలబెట్టే బాధ్యత పాలన వ్యవస్థలపై, మీడియాపై సమానంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.వేగంగా మారుతున్న సాంకేతిక పరిణామాలు, ఆర్థిక ఒత్తిళ్లు, సామాజిక మార్పులు, అంతర్జాతీయ రాజకీయ పరిస్థితుల మధ్య ప్రజాస్వామ్యం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. పాలన అనేది కేవలం అధికార వినియోగం కాదని, ప్రజల సమస్యలను అర్థం చేసుకొని సమర్థవంతమైన పరిష్కారాలు అందించడమే అసలైన లక్ష్యమని తెలిపారు.ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమం, ఆరోగ్యం, విద్య వంటి ప్రాథమిక అంశాల్లో ఫలితాలు కనిపించినప్పుడే పాలనకు నిజమైన అర్థం ఉంటుందని డా. జితేందర్ రావు అన్నారు. విధాన ప్రకటనలకే పరిమితం కాకుండా, అమలులో పారదర్శకత, సమానత్వం తప్పనిసరిగా ఉండాలని సూచించారు.



ప్రస్తుత పౌరులు మరింత అవగాహనతో, ప్రశ్నించే స్వభావంతో ఉన్నారని, అందువల్ల పాలకులు స్పందనాత్మకంగా కాకుండా ముందుచూపుతో కూడిన ప్రజాకేంద్ర పాలన వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలకు కట్టుబడి, సంస్థాగత నైతికతను కాపాడినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుందని అన్నారు.

ఈ నేపథ్యంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని డా. జితేందర్ రావు స్పష్టం చేశారు. మీడియా కేవలం వార్తలు చెప్పే వేదిక మాత్రమే కాకుండా, ప్రజల ఆలోచనలను మలిచే శక్తివంతమైన సాధనమని తెలిపారు. అయితే సంచలనాలకు ప్రాధాన్యం ఇవ్వడం, ధృవీకరణ లేని సమాచారాన్ని ప్రచారం చేయడం జర్నలిజం విశ్వసనీయతను దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.మీడియా ప్రభుత్వానికి భజన చేసే వేదికగా కాకుండా ప్రజల గొంతుగా మారాలని, అదే సమయంలో బాధ్యతాయుతంగా, సమతూకంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. సత్యాన్వేషణే జర్నలిజం మూలసూత్రమని, రాజకీయ లేదా వాణిజ్య ఒత్తిళ్లకు లొంగకుండా నిజాన్ని ప్రశ్నించే ధైర్యమే మీడియాకు ప్రాణమని పేర్కొన్నారు.దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువతకు విమర్శాత్మక ఆలోచన, పౌర అవగాహన లేకపోతే జనాభా ప్రయోజనం నిరాశగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజాస్వామ్య ప్రక్రియల్లో యువత భాగస్వామ్యం పెరిగినప్పుడే దేశం ముందుకు సాగుతుందని అన్నారు.బాధ్యతాయుత పాలన, నైతిక మీడియా, అవగాహన కలిగిన పౌరులు---ఈ మూడు నిలువ స్తంభాలపై నిలబడినప్పుడే భారత ప్రజాస్వామ్యం దీర్ఘకాలికంగా వికసిస్తుందని డా. జితేందర్ రావు తనుగుల స్పష్టం చేశారు.

# మున్సిపాలిటీల వార్డు స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు

**- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా ప్రక్రియ**







ఈకాలం న్యూస్
సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)జనవరి 17 సంగారెడ్డి జిల్లా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా జిల్లాలోని అందోల్--జోగిపేట్, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇంద్రేశం, ఇస్నాపూర్, జిన్నారం, కోహిర్, నారాయణఖేడ్, సదాశివపేట్, సంగారెడ్డి, జహీరాబాద్ మున్సిపాలిటీల వార్డు స్థానాలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు అదనపు కలెక్టర్ మాధురి తెలిపారు.కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో శనివారం అదనపు కలెక్టర్ మాధురి, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ పాండుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహించారు.జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలోని మొత్తం వార్డులకు ఎస్సీ, ఎస్సీ (మహిళ), ఎస్టీ, ఎస్టీ (మహిళ), బీసీ, బీసీ (మహిళ), అన్‌రిజర్వుడ్, అన్‌రిజర్వుడ్ (మహిళ) కేటగిరీల ప్రకారం నిబంధనలకు అనుగుణంగా రిజర్వేషన్లు కేటాయించారు. మహిళలకు కేటాయించిన వార్డులను డ్రా పద్ధతిలో ఎంపిక చేసి ప్రకటించినట్లు అదనపు కలెక్టర్ వెల్లడించారు.సంగారెడ్డి మున్సిపాలిటీలో 38 వార్డులకు గాను ఎస్టీ జనరల్‌కు 1, ఎస్సీ జనరల్‌కు 3, ఎస్సీ మహిళకు 2, బీసీ జనరల్‌కు 7, బీసీ మహిళకు 6, అన్‌రిజర్వుడ్ జనరల్‌కు 8, అన్‌రిజర్వుడ్ మహిళకు 11 వార్డులు ఖరారయ్యాయి.జహీరాబాద్ మున్సిపాలిటీలో 37 వార్డులకు ఎస్టీ జనరల్‌కు 1, ఎస్సీ జనరల్‌కు 2, ఎస్సీ మహిళకు 2, బీసీ జనరల్‌కు 7, బీసీ మహిళకు 6, అన్‌రిజర్వుడ్‌కు 9, అన్‌రిజర్వుడ్ మహిళకు 10 వార్డులు కేటాయించారు.సదాశివపేట్, అందోల్--జోగిపేట్, నారాయణఖేడ్, ఇస్నాపూర్, జిన్నారం, కోహిర్, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇంద్రేశం మున్సిపాలిటీల్లోనూ ఆయా వార్డుల సంఖ్యకు అనుగుణంగా అన్ని కేటగిరీలకు రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు తెలిపారు.రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియలో జెడ్పీ సీఈవో జానకి రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అరైవ్ అలైవ్ - 2026" కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు వ్యాస రచన పోటీలు

**- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్..**

ఈకాలం న్యూస్
సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)జనవరి 17సంగారెడ్డి జిల్లా రోడ్డు ప్రమాదాలను ఘననీయంగా తగ్గించి, ప్రజలకు రోడ్డు ప్రమాదాల నుండి రక్షణ కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర పోలీసు, రవాణా, ఆరోగ్య శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ఉద్యమమే "అరైవ్ అలైవ్ - 2026" అని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలియజేశారు. అరైవ్ అలైవ్ -- 2026 కార్యక్రమంలో భాగంగా ఈ రోజు తేది: 17.01.2026 జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు వ్యాస రచన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యత, ప్రమాదాల నివారణ వంటి అంశాలపై వ్యాసాలు రాశారని అన్నారు. వ్యాస రచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేస్తామని



పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. విద్యార్థులే భవిష్యత్తు బాధ్యతాయుత పౌరులు అని, చిన్న వయసు నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించవాల్సిందిగా సూచించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడపవరాదని, మద్యం మత్తులో ఏకాగ్రతను కోల్పోయి ప్రమాదాకు దారితీయవచ్చు అన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో, ముఖ్యంగా యువతలో రోడ్డు భద్రతపై బాధ్యతాభావం పెరుగుతుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# "జ్ఞాపకం అంటే శిలాఫలకం కాదూ ప్రజలకు ఉపయోగపడే సేవ"

**- అరుగొండ వీరన్నకు కుమారుల ఘన నివాళి**

ఈకాలం న్యూస్
జనవరి 17సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం కేంద్రం లోని బిజిలిపూర్ గ్రామం లో "జ్ఞాపకం అనేది రాతి ఫలకంగా కాకుండా, ప్రజలకు నిత్యం ఉపయోగపడే సేవగా ఉండాలి" అన్న భావనకు నిదర్శనంగా అరుగొండ వీరన్న (నాంపురం సంగన్న) వారి కుమారులు అరుగొండ అనిల్, అరుగొండ మల్లేశం ముందుకొచ్చారు.తండ్రి జ్ఞాపకార్థంగా బిజిలీపూర్--బుడ్డాయిపల్లి గ్రామాల్లో ప్రజలు విశ్రాంతి తీసుకునేలా సిమెంట్ కుర్చీలను ఏర్పాటు చేసి అర్థవంతమైన నివాళి అర్పించారు. గ్రామస్తులకు ఉపయోగపడే ఈ కార్యక్రమం సర్వత్రా ప్రశంసలు పొందింది.ఈ సందర్భంగా అరుగొండ అనిల్, మల్లేశం మాట్లాడుతూ "మా తండ్రి ఆశయాలకు



అనుగుణంగా గ్రామ అభివృద్ధికి తోడ్పడే సేవా కార్యక్రమాలు చేపట్టడమే మా లక్ష్యం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చక్రాల నాగమణి--నర్సింలు, ఉప సర్పంచ్ లింగన్న గారి శోభామ మచ్చేందర్ , వట్పల్లి మండలం మైనార్టీ అధ్యక్షుడు షాపుద్దీన్, వార్డు సభ్యులు, టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యంగా పనిచేస్తే జిన్నారం మున్సిపల్ పీఠం బీఆర్ఎస్ దే - పాల సాయిరాం



ఈకాలం న్యూస్
సంగారెడ్డి టౌన్ ప్రతినిధిజనవరి 17సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తే మున్సిపల్ పీఠం ఖచ్చితంగా బీఆర్ఎస్ దే అవుతుందని జిన్నారం మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ పాల సాయిరాం అన్నారు.జిన్నారం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నాయికోటి రాజేష్ ఆధ్వర్యంలో జిన్నారం ఎన్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ పాల సాయిరాం, పటాన్చెరు బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను కారు గుర్తుపై ఓటు వేసి ఘన విజయం సాధించేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిన్నారం మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు బలమైన ప్రజాదరణ ఉందని, దాన్ని విజయంగా మలచుకోవాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జిన్నారం వెంకటేష్ గౌడ్, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, అమీన్‌పూర్ శ్రీనివాస్ రెడ్డి, మాణిక్ యాదవ్, శివరాజ్, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డికి ఘన స్వాగతం

**పుష్పగుచ్చంతో స్వాగతించిన టియుడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు**

ఈకాలం న్యూస్
భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సభలో పాల్గొనేందుకు శనివారం ఖమ్మం వచ్చిన మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డికి టియుడబ్ల్యూ జే (ఐజేయు) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా కమిటీల నాయకులు, పలువురు



జర్నలిస్టులు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా సిపిఐ కార్యాలయం గిరి ప్రసాద్ భవన్ వద్ద పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్,సామినేని మురారి,జాతీయ కమిటీ సభ్యులు నలజాల వెంకటరావు, జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మైస పాపారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మామిడాల భూపాల్, జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, జిల్లా నాయకులు వనం వెంకటేశ్వర్లు, ఖమ్మం నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, నంచర్ల జనార్ధన చారి,జిల్లా కోశాధికారి నాగండ్ల శివ,జిల్లా నాయకులు తాళ్లూరి మురళీకృష్ణ,ఏగినాటి మాధవరావు,ఏలూరి వేణుగోపాలరావు, పసుపులేటి సత్యనారాయణ, ఈనాడు వెంకటేశ్వర్లు, చెరుకూరి గోపాలరావు, రాఘవరావు, రామారావు, రాము, వేదగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# హింద్ ది చాదర్ శ్రీ గురుదేవ్ బహదర్ సాహెబ్ జి 350 వ షాహిది శాంతిది సమగం ప్రచారం

ఈకాలం న్యూస్
సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం జోగిపేట 20వ వార్డులో సిక్కుల యొక్క తొమ్మిదవ గురువు శ్రీ గురుతేగ్ బహదూర్ సాహెబ్ జి 350వ షాహిది శాంతి సమాగం ప్రచారం గురించి తెలంగాణ సిక్ సికిలిగర్ అసోసియేషన్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలాని ఆనంద్ సింగ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా లో ఉన్నటువంటి సిక్కుల సమాజం ఊరూరా తిరిగి మండలాల వారీగా సిక్కు సోదరులకు హేంద్ -ది - చాదర్ శ్రీ గురుతేగ్ బహదూర్



సాహెబ్ జి 24,-1-2026శ25-01-2026వ తేదీ జరగబోయే హేజూర్ సాహిబ్ నాందేడ్ లో నిర్వహిస్తున్నత్వంటి కార్యక్రమం గురించి జాగృతి చేస్తూ అందరికి పంప్లెట్, గురుతేగ్ బహదూర్ మహారాజ్ సిల్వర్ సింబల్, ఫోటో ఇస్తూ మహారాష్ట్ర చేసుకుంటూ తెలంగాణ లో రాష్ట్రమంతా తిరుగుకుతూ జోగిపేట కు వచ్చి సిక్కు సోదరులతో కలసి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సిక్కుల సంఘం కమిటీ జగన్ సింగ్, గ్యాన్ సింగ్ ( పోట్ల సింగ్ ), వీరు ఈ జిల్లాకు సంబంధించిన సిక్కు సోదర గురించి తెగ సింగ్ ను పిలిపించి, సంగారెడ్డి సికిలిగర్ సంఘం అధ్యక్షులు దరియావ్ సింగ్, ఉపాధ్యక్షులు హరిజిత్ సింగ్, కమిటీ సభ్యులు బల్మత్ సింగ్, పవన్ సింగ్ లకు మహారాష్ట్రలో సర్దార్ జిలా అతి పెద్ద పవిత్రమైన సచ్ ఖండ్ శ్రీ హజూర్ సాహెబ్ గురుద్వారా లో కార్యక్రమంలో అందరూ హాజరు కాగలరని కోరుకున్నారు.

# తీన్మార్ మల్లన్న జన్మదినం సందర్భంగా అన్నదానం, పండ్ల పంపిణీ

ఈకాలం న్యూస్
సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జన్మదినం సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం మరియు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌పీ సంగారెడ్డి మండల అధ్యక్షులు రవి, మునిపల్లి అధ్యక్షులు యూసుఫ్, ప్రభు, సాయి కుమార్ గౌడ్, నరేష్, సాయి కుమార్ ముదిరాజ్, అబ్దుల్, తాహేర్ తదితరులు పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# 23వ వార్డు కౌన్సిలర్‌గా ఆశీర్వదించాలి : ఎదురుగట్ల చిట్టిమల్లు దంపతుల విజ్ఞప్తి

**ఈకాలం న్యూస్**



ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు కౌన్సిలర్ ఎన్నికల్లో తాను మరియు తన భార్య ప్రజల ముందుకు వస్తున్నామని, తమను ఆశీర్వదించి అత్యంత మెజార్టీతో గెలిపించాలని ఎదురుగట్ల చిట్టిమల్లు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏదులాపురం మున్సిపాలిటీ 23వ వార్డు కౌన్సిలర్‌గా తాను, తన భార్య ఎదురుగట్ల లక్ష్మి పోటీ చేస్తున్నామని తెలిపారు. ప్రజలతో ఏర్పడిన ఋణాన్ని తీర్చుకునే సమయం వచ్చిందని, వార్డు అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. పురిటిగడ్డ రుణాన్ని తీర్చుకునే సంకల్పంతో ప్రజాసేవ చేయాలనే ధ్యేయంతో ఎన్నికల బరిలో నిలిచామని, గతంలో ప్రజల నుంచి పొందిన ఆదరణను మరోసారి అందించాలని కోరారు. వార్డు అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ ఎన్నికల్లో తమను ఆశీర్వదించి 23వ వార్డు కౌన్సిలర్‌గా అత్యంత మెజార్టీతో గెలిపించాలని ఏదులాపురం ప్రజలను ఎదురుగట్ల చిట్టిమల్లు దంపతులు కోరారు.

# అల్లాదుర్గంలో సీఎం కప్ ర్యాలీ



**ఈకాలం న్యూస్**

అల్లాదుర్గం మండల కేంద్రంలో మండల పరిపాలన అధికారి వేద ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎం కప్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వట్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మీ శేషారెడ్డి, తహసిల్దార్ మల్లయ్య, సబ్ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎంఈఓ, అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల ప్రాధాన్యతతో పాటు రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షురాలు సౌమ్య సురేష్ గౌడ్, ఉపాధ్యాయులు, వివిధ గ్రామాల సర్పంచులు శశిధర్ రెడ్డి, హరికృష్ణ, వీరన్న పటేల్, శంకర్ నాయక్, రమ్య భూమిరెడ్డి, ఉప సర్పంచ్ కలాలి పాండు, మండల ప్రధాన కార్యదర్శి బాలకిషన్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బేతయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్తో పాటు సదానందం, రోషన్, చెన్నప్ప, షరీఫ్, ఆంజనేయులు, రేవంత్, నర్సింలు, సుధాకర్, సాయిలు, రాజు నాయక్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఛాతీ నొప్పితోనూ కర్తవ్య నిబద్ధత

**– 40 మంది ప్రాణాలు కాపాడి కన్నుమూసిన ఆర్టీసీ డ్రైవర్ జనార్ధన్**

**ఈకాలం న్యూస్**




సంగారెడ్డి నియోజకవర్గం ఇంచార్జి (కే. సంగమేశ్వర్)జనవరి 17సంగారెడ్డి జిల్లా పల్వట్ల గ్రామ శివారు పరిధిలో శుక్రవారం హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ జనార్ధన్‌కు అకస్మాత్తుగా ఛాతీలో తీవ్రమైన నొప్పి రావడంతో అప్రమత్తమై బస్సును రోడ్డు పక్కకు చాకచక్యంగా నిలిపివేశారు. ఈ చర్యతో బస్సులో ప్రయాణిస్తున్న దాదాపు 40 మంది ప్రయాణికుల ప్రాణాలు కాపాడబడ్డాయి. ఘటనను గమనించిన ప్రయాణికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, వట్పల్లి 108 సిబ్బంది సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి జనార్ధన్‌ను జోగిపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్య చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ సాయంత్రం జనార్ధన్ కన్నుమూశారు. తన ప్రాణాలు ప్రమాదంలో ఉన్నా ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి వృత్తి ధర్మాన్ని చాటుకున్న జనార్ధన్‌ను గ్రామ ప్రజలు కన్నీటి పర్యంతమయ్యేలా నివాళులు అర్పించారు. ఇలాంటి బాధ్యతాయుత డ్రైవర్లు ఆర్టీసీలో ఉండటం ప్రయాణికుల అదృష్టమని కొనియాడారు. ఆకస్మిక మృతితో బ్రాహ్మణపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. జనార్ధన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు.

# ఈనెల 19న ప్రజావాణి రద్దు

**–జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**ఈకాలం న్యూస్**

ఈ నెల 19వ తేదీ (సోమవారం) నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య నేడొక ప్రకటనలో తెలిపారు.
మున్సిపల్ ఎన్నికల సన్నాహక పనుల్లో జిల్లా అధికారులు నిమగ్నమై ఉన్న నేపథ్యంలో, ఈ నెల 19న నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని కలెక్టర్ కోరారు.



# మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ పారదర్శకంగా పూర్తి

**ఈకాలం న్యూస్**

మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియను ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో నిర్వహించామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. జిల్లా సమీకృత కార్యాలయ సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో శనివారం రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీల పరిధిలోని



మొత్తం 141 వార్డులకు రిజర్వేషన్ ప్రక్రియను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీల్లో ప్రభుత్వం జారీ చేసిన జీవోలకు అనుగుణంగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వార్డు వారీగా రిజర్వేషన్లు కేటాయించామని తెలిపారు. గత మున్సిపల్ ఎన్నికలలో అమలైన రిజర్వేషన్లు, ఎస్సీ-ఎస్టీ-బీసీ జనాభా లెక్కలు, రొటేషన్ విధానం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఈ రిజర్వేషన్ ప్రక్రియను నిర్వహించినట్లు వెల్లడించారు. రిజర్వేషన్ ప్రక్రియ మొత్తం రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో నిర్వహించడంతో పాటు, ప్రతి అంశాన్ని స్పష్టంగా వివరించామని, తద్వారా ఎటువంటి సందేహాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకతతో రిజర్వేషన్లను ప్రకటించామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, మున్సిపల్ కమిషనర్లు హన్మంతరెడ్డి, రమాదేవి, శ్రీనివాస్ రెడ్డి, అశోక్ రెడ్డి, మున్వర్ పాషా, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఎస్ఎఫ్--2026కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## విద్యాశాఖ డైరెక్టర్ నికోలస్

**ఈకాలం న్యూస్**

సంగారెడ్డి జిల్లా రాష్ట్రం, జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేసేలా సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ -2026 నిర్వహణకు అన్ని విధాల పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ డైరెక్టర్ నికోలస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 19 నుంచి రామచంద్రపురం మండలం కొల్లూరులోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించనున్న సైన్స్ ఫెయిర్ ఏర్పాట్లను శనివారం ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గాడియం స్కూల్ ప్రాంగణమంతా కలియతిరిగి ఎంట్రెన్స్, ఎగ్జిట్ మార్గాలు, సూచిక బోర్డులు, విద్యుత్ కనెక్షన్లు, భద్రతా చర్యలు, వసతి సౌకర్యాలు, పారిశుధ్యం, తాగునీటి ఏర్పాట్లను సమగ్రంగా తనిఖీ చేశారు. సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనే విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతిథులకు అవసరమైన వసతి, భోజనం, రవాణా ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని పలు కీలక సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ సౌత్ ఇండియా నలుమూలల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు, అతిథులు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో సమర్థవంతమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎగ్జిబిట్లను ప్రదర్శించే విద్యార్థులు, సందర్శకులకు ఇబ్బందులు తలెత్తకుండా స్పష్టమైన సూచికలు, భద్రతా చర్యలు, పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సైన్స్ ఫెయిర్ నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన వసతి,





భోజనం, రవాణా, భద్రత, పారిశుధ్యం, వైద్య సేవలు, విద్యుత్, తాగునీరు తదితర కమిటీల సభ్యులు పరస్పర సమన్వయంతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఆరు రాష్ట్రాల నుంచి పాల్గొనే విద్యార్థులు ఆనందంగా, ఉల్లాసంగా సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనేలా ఏర్పాట్లు ఉండాలని పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, నోడల్ అధికారి లింబాజీ, ప్రింట్ ఛ మీడియా కమిటీ కన్వీనర్ ఎండీ జాకీర్ హుస్సేన్, మండల విద్యాశాఖ అధికారులు నాగేశ్వర్ నాయక్, రాములు, విద్యాసాగర్, విజయకుమార్, వెంకట్ నర్సిములు, అనురాధతో పాటు వివిధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు

# సంస్కారంతో కూడిన విద్యే సంపూర్ణ విజయం

**- ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇంటరాక్షన్**
**- సమాజంపై బాధ్యత కలిగి ఉండాలి -- తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలి**

**ఈకాలం న్యూస్**

మహబూబ్‌నగర్:సంస్కారం, సమాజంపై అవగాహన, బాధ్యతాయుతమైన విద్య బోధనే విద్యార్థులను విజయ శిఖరాలకు చేర్చుతుందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. లక్ష్య సాధనలో తల్లిదండ్రుల ప్రేమ, గురువుల మార్గదర్శకత్వం కీలకమని ఆయన స్పష్టం చేశారు.

మహబూబ్‌నగర్‌లో నూతనంగా నిర్మించనున్న ట్రిపుల్ ఐటీ క్యాంపస్ భవనాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి శనివారం శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు.





**మంత్రి మాట్లాడుతూ**

"మన సంస్కృతిలో తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు. మాతృదేవోభవ, పితృదేవోభవ అన్నదే మన తొలి పాఠం. అమ్మ ప్రేమలో ఆప్యాయత కనిపిస్తే, నాన్న ప్రేమ మౌనంగానే మనల్ని ఉన్నత శిఖరాలకు నడిపిస్తుంది. తల్లిదండ్రుల ప్రేమ, గురువుల మార్గదర్శకత్వం కలిసినప్పుడే విజయం మీ సొంతమవుతుంది" అని పేర్కొన్నారు.

**ఐఏఎస్ కావడమే లక్ష్యం**

ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ విద్యార్థి పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ తన లక్ష్యం ఐఏఎస్ అధికారి కావడమని, జిల్లా వెనుకబాటుతనాన్ని తొలగించడమే తమ బాధ్యత అని తెలిపారు. మీ జీవితంలో స్ఫూర్తి ఎవరు? అని అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ"తల్లిదండ్రులు, గురువులే నా స్ఫూర్తి. కేవలం పుస్తక జ్ఞానం కాదు, విజ్ఞత , సంస్కారం ఉన్నప్పుడే విద్యార్థి పరిపూర్ణుడవుతాడు. సమాజంలో భాగమైన మీరు, సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత కలిగి ఉండాలి" అని చెప్పారు.

**అమ్మాయిల చదువుకే పెద్దపీట**

విద్యార్థిని శ్రీవిద్య మాట్లాడుతూ యూపీఎస్సీ పరీక్షలో మంచి ర్యాంక్ సాధించి ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని ఆత్మవిశ్వాసంగా తెలిపింది. ?? మంత్రి స్పందిస్తూ"చదువులోనూ, నాయకత్వ లక్షణాల్లోనూ అమ్మాయిలే ముందున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బాలికల విద్యపై ప్రత్యేక శ్రద్ధ ఉంది" అంటూ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. శ్రీవిద్య ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

**వేదికపైనే రియల్ ఇన్‌స్పిరేషన్**

ఐఏఎస్ కావాలని కలలు కంటున్న విద్యార్థులకు వేదికపైనే స్ఫూర్తిని నింపారు మంత్రి. విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా, జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, మహిళా ఐపీఎస్ అధికారిని విద్యార్థులకు పరిచయం చేస్తూ
"మీ లక్ష్యాలకు ప్రతీకలు మీ ముందే ఉన్నారు. కశ్మీర్ నుంచి వచ్చి ఇక్కడ సేవలందిస్తున్న యోగితా రాణాను స్ఫూర్తిగా తీసుకోండి" అని పిలుపునిచ్చారు. ముగ్గురు అధికారిణులతో విద్యార్థులు మాట్లాడేలా చేసి, విద్యార్థినులు ప్రేరణ పొందేలా చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జి ఎం ఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుబ్బపు మచ్చేందరు కు ప్రసాదం అందజేసిన - బి ఆర్ ఎస్ నాయకులు

**ఈకాలం న్యూస్**

నారాయణఖేడ్ మున్సిపల్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు బాదల్గాం నాగేష్ సేట్ శబరిమల యాత్రను విజయవంతంగా ముగించుకుని, జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు గుబ్బపు మచ్చేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తిరుపతి, శబరిమల ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ 4వ వార్డ్ అధ్యక్షులు శ్రీకాంత్, 8వ వార్డ్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తుకారాం, కాశీనాథ్ మందిర పాలక మండలి సభ్యులు శివాజీ, నాయకులు గొర్రెకంటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.
ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవలో జి ఎం ఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను నాయకులు ప్రశంసిశారు



Eekalam News, printed and published by Devender Nukala, eekalam publications, printed at sunday printing press, h.no.361, bhagyalaxmi colony, medchal malkaj-giri, telangana 500054. Editor : Devender Nukala. eekalamnews@gmail.com, RNI(PRGI) No.TGTEL/25/A3149




# ఈకాలం

THE HONEST TELUGU DAILY

FLASH FLASH




## ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్

ఆదిలాబాద్ మున్సిపాలిటీ చైర్మన్ పీఠం జనరల్ మహిళకు రిజర్వ్ అయింది. 49 వార్డుల్లో కౌన్సిలర్ స్థానాల రిజర్వేషన్ల వివరాలు..

వార్డు - 1 - ఎస్సీ మహిళ
వార్డు - 2 - జనరల్
వార్డు - 3 - బీసీ మహిళ
వార్డు - 4- జనరల్
వార్డు - 5 - జనరల్ మహిళ
వార్డు - 6 - జనరల్ మహిళ
వార్డు - 7 - బీసీ మహిళ
వార్డు - 8 - ఎస్సీ
వార్డు - 9 - ఎస్టీ మహిళ
వార్డు - 10 - బీసీ మహిళ
వార్డు - 11 - ఎస్సీ మహిళ
వార్డు - 12 - ఎస్టీ
వార్డు - 13 - జనరల్ మహిళ
వార్డు - 14 - ఎస్టీ
వార్డు - 15 - జనరల్ మహిళ
వార్డు - 16 - జనరల్ మహిళ
వార్డు - 17 - ఎస్సీ
వార్డు - 18 - ఎస్సీ
వార్డు - 19 - జనరల్
వార్డు 20 - బీసీ
వార్డు - 21 - జనరల్
వార్డు - 22 - జనరల్
వార్డు - 23 - జనరల్
వార్డు - 24 - బీసీ
వార్డు - 25 - జనరల్ మహిళ
వార్డు - 26 - బీసీ
వార్డు - 27 - జనరల్
వార్డు - 28 - జనరల్
వార్డు - 29 - జనరల్ మహిళ
వార్డు - 30 - జనరల్
వార్డు - 31- బీసీ మహిళ
వార్డు - 32 - బీసీ మహిళ
వార్డు - 33 - బీసీ
వార్డు - 34 - జనరల్
వార్డు - 35 - జనరల్ మహిళ
వార్డు - 36 - బీసీ మహిళ
వార్డు - 37 - జనరల్ మహిళ
వార్డు - 38 - బీసీ మహిళ
వార్డు - 39 - జనరల్ మహిళ
వార్డు - 40 - జనరల్
వార్డు- 41- జనరల్ మహిళ
వార్డు - 42 - ఎస్సీ మహిళ
వార్డు - 43 - బీసీ
వార్డు - 44 - బీసీ
వార్డు - 45- జనరల్ మహిళ
వార్డు - 46 - బీసీ
వార్డు - 47 - జనరల్
వార్డు - 48 - జనరల్ మహిళ
వార్డు -49 - బీసీ

- Devender N, Eekalam News

# జనరల్ మహిళ!

